## క్లుప్తంగా

### మద్యం తాగి వాహనాలు నడపొద్దు



**శాయంపేట :** మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తగట్టు సింగారం స్టేజీ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల వద్ద సంబంధిత ధ్రువీకరణపత్రాలు పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

**పరకాల:** స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు, ప్రజలకు మరింత అత్యుత్తమ సేవలు అందించాలనే ఆలోచనతో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ జి.కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 11 సంవత్సరాల బాలురకు, 16 సంవత్సరాల బాలికలకు, ఉచిత బస్‌పాస్ సౌకర్యం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు, వికలాంగులకు, డయాలసిస్ రోగులకు ఉచితం ప్రయాణం సౌకర్యం అందించడం జరుగుతుందన్నారు. పెళ్లిలకు 10 శాతం రాయితీ, ప్రజల సరుకు రవాణా ఒక్క రోజులో చేరవేయడంతో పాటు 20 రోజుల చార్జీతో 30 రోజుల బస్‌పాస్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 99592 26051 నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

### రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీ చేయాలి



**ఆత్మకూరు :** భారతదేశంలో ఉన్న పౌరులందరికీ భారత రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) మండల అధ్యక్షుడు మైదం రవి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు అమరేందర్, విజయ్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి

**ఎల్కతుర్తి:** తన కుమారుడికి పెళ్లి కావడం లేదని మనస్తాపం చెందిన ఇద్దరు దంపతులు విషగుళికలు మింగారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ దంపతుల్లో ఒకరు మృతి చెందిన సంఘటన భీమదేవరపల్లిలో చోటు చేసుకుంది. మంగళవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుగునూరి స్వరూప (45), సుగునూరి రవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆ దంపతులు ఇద్దరి కుమార్తెల పెళ్లిళ్లు చేశారు. కాగా కుమారుడికి పెళ్లి కావడం లేదని తరుచూ బాధపడేవారు. కాగా కూతుర్ల పెళ్లిళ్లకు కొంత అప్పు చేశారు. చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెందేవారు. ఈ నెల 18న వ్యవసాయ పనులు ముగించుకొని దంపతులిద్దరూ ఇంటికి వచ్చారు. తన కుమారుడు వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇద్దరు దంపతులు కిందపడి ఉన్నారు. పక్కనే విషగుళికలు ఉన్నాయి. దీంతో గమనించిన కుమారుడు తల్లిండ్రులను చికిత్స నిమిత్తం ముల్కనూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించాడు. వైద్యుడి సలహా మేరకు అక్కడి నుంచి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఇద్దరు దంపతుల్లో తల్లి పరిస్థితి మృతి చెందినట్లు తెలిపారు. కుమారుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

### తైబజార్ లీజు వేలం వాయిదా

**పరకాల:** సరైన వేలం రాకపోవడంతో పరకాల తైబజార్ లీజు వేలం పాటను ఈ నెల 27కు వాయిదా వేస్తున్నట్లు స్థానిక మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి తెలిపారు. 2023–24 సంవత్సరానికి తైబజార్ లీజు ఇవ్వడం కోసం మంగళవారం సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని నిర్వహించారు. కమిషనర్ పర్యవేక్షణలో నిర్వహించిన వేలం పాటలో ముగ్గురు డిపాజిట్‌దారులు పాల్గొన్నప్పటికీ సరైన వేలం రాకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి నష్టం జరుగకూడదన్న ఆలోచనతో 27కు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపాజిట్‌దారులు అల్లె కిషోర్, బండి శ్రీనివాస్, మడికొండ శ్రీను, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రానైట్ క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

**ధర్మసాగర్:** మండలంలోని నారాయణగిరి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కలర్ గ్రానైట్ క్వారీ ఏర్పాటు కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ సునీత అధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ నారాయణగిరి గ్రామంలోని సర్వే నంబర్ 609లో గల 15 హెక్టార్ల భూమిలో 46,080 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో శ్రేయ ఎక్స్‌పోర్ట్ కంపెనీ సంవత్సరానికి 46 వేల క్యూబిక్ మీటర్ల గ్రానైట్ తవ్వకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇదే గ్రామంలో సర్వే నెంబర్ 609లో మరో 15 హెక్టార్ల భూమిలో శ్రీమాన్ రాక్స్ సంస్థ 47,094 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో తవ్వకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అయా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేస్తున్న గ్రానైట్ క్వారీ నారాయణగిరి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుందని తెలిపారు. దీని వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 150 మంది గ్రామ యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. గ్రానైట్ తవ్వకాలు కుడా వైర్సా అనే నూతన టెక్నాలజీ ఉపయోగించి చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యావరణ మంత్రిత్వశాఖ నిబంధనలకు లోబడే పనులు చేస్తామని తెలిపారు. గ్రామంలోని మత్స్యకారులు మాట్లాడుతూ గ్రానైట్ క్వారీకి ఇచ్చిన భూముల పక్కనే ఆరు చెరువు కుంటలు ఉన్నాయని, వాటిపై ఆధారపడి ఎంతోమంది మత్స్యకారులు జీవిస్తున్నారని తెలిపారు. అందరి అభిప్రాయాలను వీడియో రికార్డు చేశామని, కొంత మంది రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను తెలిపారని పీసీబీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజిని, సర్పంచ్ సోమిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల శ్రమదానం

**కేయూ క్యాంపస్:** కేయూలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పరిపాలనాభవనం ఎదుట మంగళవారం శ్రమదానం చేశారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. చెత్తచెదారం తొలగించేందుకు చీపుర్లతో ఊడ్చారు. ఈ సందర్భంగా కుక్టాజాక్ చైర్మన్ డాక్టర్ పి కరుణాకర్‌రావు మాట్లాడుతూ కేయూకు మంచి గ్రేడ్ రావటంలో తమవంతు పాత్రను కూడా పోషిస్తామని తెలిపారు.కార్యక్రమంలో కన్వీనర్ సాదు రాజేష్, బాధ్యులు నిరంజన్, మామిడి లింగయ్య, బి.సతీష్, మంతెన శంకరయ్య, కర్రె సదాశివ్, ఆరూరి సూర్యం, టి.శ్రీనివాస్, చందులాల్, మల్లేష్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం**

కేయూలో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) యూనిట్–1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం మంగళవారం కూడా కొనసాగింది. క్యాంపస్‌లోని క్యాంటీన్ పక్కన రోడ్డులో ఇరువైపుల శ్రమదానం చేశారు. అక్కడి నుంచి మహిళా హాస్టల్ వరకు చెత్తచెదారంను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ ఈ శిబిరంలో పాల్గొని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందించారు.



కేయూలో పరిపాలనా భవనం వద్ద శ్రమదానం చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

### దళితబంధు సంరక్షణ సమితి జిల్లా కమిటీ

**హసన్‌పర్తి :** దళిత బంధు సంరక్షణ సమితి జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా గూడెం రమేష్ (హన్మకొండ), ఉపాధ్యక్షులుగా కుక్కమూడి సంపత్(దండెపల్లి), గుత్తికొండ చక్రధర్ (వంగపల్లి), ప్రధానకార్యదర్శిగా చెరిపల్లి రామచంద్రం (శనిగరం), సహాయ కార్యదర్శులుగా చిట్యాల భద్రయ్య (గోపాలపురం, హన్మకొండ), గూడెం లింగయ్య(తిమ్మాపురం,), ఆర్గనైజింగ్ కార్యదర్శులు తుపాకుల ప్రతాప్ (హన్మకొండ), గుజ్జల రమేష్(తిమ్మాపూర్), ప్రచార కార్యదర్శులుగా ఆరెపల్లి మల్లయ్య(జీలు గుల), ఇల్లందుల దేవయ్య(ముస్తఫాపూర్), కోశాధికారిగా మొండె భద్రయ్య (శనిగరం) ఏకగ్రీవమయ్యారు.

### 'అల్లం'ను కలిసిన ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు



**నయీంనగర్:** గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌కు విచ్చేసిన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణను ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. క్లబ్ అభివృద్ధి, ప్రభుత్వం నుంచి సభ్యులకు అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలకు సహకరించాల్సిందిగా అధ్యక్ష కార్యదర్శులు అల్లం నారాయణను కోరారు అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

**ఖిలావరంగల్ :** ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెడిదె వీరన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఖిలావరంగల్ పరిసరాల్లో ఇటీవల కురిసిన వర్షానికి నెలవారిన పంట పొలాలు, కల్లాల్లో తడిసి ముద్దయిన వరిధాన్యాన్ని మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట నష్టాన్ని సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల కురిసిన వర్షానికి తూర్పుకోటలో కూలిన ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఏసీరెడ్డి ప్రభాకర్, ఏసీరెడ్డి రఘు, కలకుట్ల కుమార్, సంపత్, రాజు, అశోక్, శివకుమార్, సూరిశెట్టి వినోద్, కుమారస్వామి, ఏలియా, సత్యం, రాజేష్, సాంబయ్య, నాగయ్య, పాల్గొన్నారు.

### పనులను అడ్డుకున్న ఓనర్లు

**వరంగల్ అర్బన్:** వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులోని ఓ ప్రైవేట్ కాలేజీ సమీపంలో శివసాయి లే అవుట్ మధ్య నుంచి బల్దియా ఇంజినీర్లు డ్రెయినేజీ నిర్మాణం చేస్తుండటంతో మంగళవా రం ప్లాట్ల యజమానులు అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం ఉన్న లే అవుట్‌లో ఇలా డ్రెయినేజీ కట్టనివ్వబోమని గొడవకు దిగారు. బల్దియా టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి చేరుకొని ప్లాట్లను పరిశీలించారు.

# రెండో రోజు కొనసాగిన క్రీడా పోటీలు

**వరంగల్ స్పోర్ట్స్:** హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహంగా కొనసాగాయి. రెండో రోజు రెజ్లింగ్, వాలీబాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, ఆర్చరీ క్రీడలలో పోటీలు నిర్వహించగా, ఆయా పోటీలకు డీఆర్‌ఓ వాసుచంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ , డీవైఎస్‌ఓ జి అశోక్‌కుమార్, డీఎస్‌ఏ కోచ్ లు నరేందర్, కె రాజు, విష్ణువర్ధన్, జీవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా సీఎం కప్ క్రీడాపోటీలు**

**కాశిబుగ్గ :** సీఎం కప్ క్రీడాపోటీలు వరంగల్ ఓ సిటీ స్టేడియంలో ఉత్సహంగా కొనసాగుతున్నా యి. జిల్లాస్థాయి పోటీలు సోమవారం ప్రారంభం కాగా రెండో రోజు మంగళవారం జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, బాక్సింగ్, చింతల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్, హనుమకొండ జేఎన్‌ఎస్‌లో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, స్విమింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల ఆధికారి ఎస్ ఇందిర మాట్లాడుతూ అన్ని ఆటలపోటీలు సెమీఫైనల్స్ దశకు చేరుకున్నాయని బుధవారం ఫైనల్స్ జరిగాక రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో కోచ్‌లు సత్యవాణి, లింగమూర్తి, సుమన్, మహేందర్, కుమారస్వామి పీఈటీలు పాల్గొన్నారు.

### 'శ్వేతార్క'లో భామ చతుర్థి వేడుకలు



**కాజీపేట :** కాజీపేట స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో మంగళవారం భామ చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భద్రకాళి దేవాలయ ఆస్థాన పండితులు, ఆలయ వ్యవస్థాపకులు అయినవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో అర్చకులు వరుణహోమం జరిపించారు. వేసవి ఎండలు మండి పోతుండడంతో వేసవి తాపం తగ్గి వర్షాలు పడాలని ఆకాంక్షిస్తూ హోమం చేశారు. అన్నపూర్ణ భవనంలో భక్తులకు మహాన్నదానం చేశారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**హన్మకొండ అర్బన్ :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడకపోతే రానున్న కాలంలో మనుషుల మనుగడ కష్టంగా ఉంటుందని డాక్టర్ అనితారెడ్డి, ఈఈ సునిత అన్నారు. మంగళవారం బాలసముంద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో మానవపాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ డాక్టర్ అనితారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సునిత ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం, చెట్లను నరకడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అనితారెడ్డి

# కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందుల పట్టివేత

- 'పరమేశ్వర ఆగ్రో ఏజెన్సీస్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

**పరకాల :** టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్న ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పరమేశ్వర ఆగ్రో ఏజెన్సీస్ దుకాణం నిర్వాహకుడు రైతులకు కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాంబాబు, పరకాల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌కు సమాచారం అందించి సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో రూ.68,246 విలువైన కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు లభ్యమయ్యాయి. అధికారులు దుకాణ నిర్వాహకుడు దేవా సతీష్ పురుగు మందుల చట్టం 1968 రూల్ 10 ఏ ను ఉల్లంఘించినట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు సీఐ పుల్యాల కిషన్ తెలిపారు. రైతులను మోసం చేసే వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న కాలంచెల్లిన విత్తనాలు

# జర్నలిస్టులకు మాట ఇచ్చి నెరవేర్చబోతున్నా..

- తూర్పు ఎమ్మెల్యే నరేందర్

**వరంగల్:** సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ఎన్నికల్లో జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేర్చబోతున్నానని తూర్పు ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. మంగళవారం 12వ డివిజన్ దేశాయిపేటలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల సొంత ఇంటి కల నిజం చేయాలని సంకల్పంతో సీఎం దృష్టికి తీసుకుపోవడంతో జీవోను జారీ చేశారన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ దేశాయిపేటలో ఎమ్మెల్యే నరేందర్ నిర్మించిన జర్నలిస్టు కాలనీ ఒక మోడల్ అని అభినందించారు. టీయూడబ్ల్యూజె(143)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**ఐనవోలు:** మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారు వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. జఫర్‌ఘడ్ ఎస్సై శంకర్‌నాయక్ కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం వెంకటాపూర్ శివారులోని గోకె రవి తన సొంత వ్యవసాయ బావి వద్దకు వెళ్లి బావి మోటార్ ఆన్‌చేశాడు. ఈ క్రమంలో వాసన రావడంతో బావిలోకి తొంగి చూడగా మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని గమనించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడు నాలుగు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని, అతని శరీరంపై పలు గాయాలు ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడు నల్ల నెక్కర్, జంజం ధరించి ఉన్నట్లు ఎస్సై శంకర్‌నాయక్ తెలిపారు. మృతదేహాన్ని గుర్తు పట్టిన వారు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# రసాయన ఎరువులు భూసారానికి నష్టం

**కమలాపూర్ :** రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడకంతో భూమి సారవంతం తగ్గిపోతుందని బీసీఐ క్షేత్ర సహాయకుడు కంచం అనిల్ అన్నారు. మంగళవారం మండలంలోని వంగిడిపల్లిలోని ధర్మానగర్ కాలనీలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బీసీఐ కేశవపూర్ ఉత్పత్తిదారుల సంస్థ, ఎస్ఎల్ఎం ప్రాజెక్ట్ అధ్వర్యంలో పునరుత్పాదక వ్యవసాయంలో భాగంగా గ్రామంలోని బీసీఐ రైతు చేనులో నవధాన్యాల విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ అధిక రసాయనాల వాడకంతో భూమి, మనుషులు, జంతువులకి హాని కలుగుతుందన్నారు. మొక్కలకు కావాల్సిన పోషకాలు ఈ నవధాన్యాలతో మొక్కలకు పుష్కలంగా అందుతాయన్నారు. భూమిలో నత్రజని సారం పెరుగుతుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందుతామన్నారు. రైతులు పొలాల్లో పశువుల ఎరువు, చెరువుల మట్టి వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు తేజస్ పాటిల్, శ్రీపద్ పాటిల్, సార్థస్ స్వామి, ఆకుల రమేష్, శ్రీనివాస్, రాజు,శ్రీను, రమేష్, శంకర్, ఎల్లయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



పొలంలో నవధాన్యాలు చల్లుతున్న బీసీఐ క్షేత్ర సహాయకుడు, వ్యవసాయ విద్యార్థులు

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మడికొండ:** గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండలో పలు అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే పార్టీ ఉద్దేశం అన్నారు. ఈ సందర్భంగా మడికొండలోని పోచమ్మ ఆలయం, మడేలయ్య ఆలయం వద్ద రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, జానపట్ల సారయ్య, బొల్లికొండ రవీందర్, వెన్నమల్ల రమేష్, గుంజ రవి, మినుగు సతీష్, ఏపీ ప్రశాంత్, బోగి లింగమూర్తి, బండారి మహేందర్, మూర్తి, నార్లగిరి కుమారస్వామి, మున్సిపల్ అధికారులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

# జెడ్పీటీసీ రవీందర్‌కు మాతృవియోగం

**ఎల్కతుర్తి:** భీమదేవరపల్లి జెడ్పీటీసీ వంగ రవీందర్‌కు మాతృవియోగం కలిగింది. రవీందర్ తల్లి వంగ కొమురమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి విషయం తెలుసుకున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హన్మకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఇంద్రనీల్‌లు ముల్కనూర్‌కు చేరుకొని కొమురమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. వారివెంట ఎంపీపీ జక్కుల అనీత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



కొమురమ్మ (ఫైల్)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

# సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**శాయంపేట :** జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం జేపీఎస్‌లు సీఎం కేసీఆర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు రాజు, రత్నాకర్, రాజమల్లయ్య, జేపీఎస్‌లు తిరుపతి, శ్రీనివాస్, సునీల్, చామంతి, అజయ్, తిరుపతమ్మ, రాధిక, నాగశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు

# లబ్ధిదారుల ఇంటికే 'కల్యాణలక్ష్మి'

**కాజీపేట అర్బన్ :** లబ్ధి దారుల ఇంటింటికి వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, వరంగల్ జి ల్లా బీఆర్ఎస్ అధ్యక్షు డు అరూరి రమేష్ పంపిణీ చేశారు. కాజీపేట మండలం 44, 45వ డివిజన్ పరిధిలోని కడిపికొండ, కుమ్మరిగూడెం, రాంపేటకు చెందిన లబ్ధిదారుల ఇంటికి స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి చెక్కులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, దర్గా పీఏసీఎస్ చైర్మన్ వనం రెడ్డి, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, రమేష్, జైపాల్‌రెడ్డి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

# బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆత్మకూరు : మల్లమ్మ కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నడికూడ : ఆర్థికసాయం అందజేస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్

**ఆత్మకూరు :** మండలంలోని గుడెప్పాడ్‌కు చెందిన మహమ్మద్ అంకూస్, పరికి మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాలను పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్, పీసీసీ సభ్యుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, గుడెప్పాడ్ ఎంపీటీసీ బీరం రజినీకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వీసం శ్రీనివాస్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి మహిపాల్‌రెడ్డి, గుడెప్పాడ్ గ్రామ అధ్యక్షుడు కందికొండ రఘుపతి, ఉపాధ్యక్షుడు చీదురాల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

**ఆర్థికసాయం**

**నడికూడ :** మండలంలోని కౌకొండకు చెందిన ఇల్లందు రజిత, కుసుమ సుదర్శన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర దేవేందర్‌గౌడ్ మంగళవారం పరామర్శించారు. కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంక్రటామ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం చేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు మేకల చిరంజీవి, పేరువాల భాస్కర్, పార్థు, శ్రీకాంత్, అనిల్, మధు పాల్గొన్నారు.